# సాక్షి జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం | 1 | డిసెంబర్ | 2023





**ఓటు వేసేందుకు వెళ్తూ అనంతలోకాలకు..**

**కొమ్మూరి వర్సెస్ పల్లా**
- వరుష పదజాలంతో మాటలు
- నాలుగు చోట్ల లాఠీచార్జ్

**ఓటర్లపై పోలీసుల దురుసు ప్రవర్తన** - 8లో

**ఉద్రిక్తతలు.. ఘర్షణలు**
- పోలింగ్‌కేంద్రాల వద్ద వివిధ పార్టీల శ్రేణుల బాహాబాహీ

- 8లో

**పోల్.. కూల్**
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓటర్ల సందడి
- ఓటేసిన ప్రముఖులు

**ప్రశాంతంగా ముగిసిన పోలింగ్** - 9లో


**వాతావరణం**

గరిష్టం/కనిష్టం $31.2^0$/$20.3^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలితో పాటు మంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### బుగులోని జాతరలో ఎమ్మెల్సీ చారి



**రేగొండ:** తిరుమలగిరి శివారులోని బుగులోని జాతర ఐదో రోజు కూడా భక్తులతో కిటకిటలాడింది. జాతరను గురువారం మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి సందర్శించారు. వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట లెంకల రాజిరెడ్డి, గోపు భిక్షపతి, సూర నర్సింగరావు, నడిపెల్లి వెంకట్రావు, వావిలాల రమేష్, సదానందం, ప్రభాకర్, సుభాష్ పాల్గొన్నారు.

### వందేళ్ల వృక్షానికి నిప్పు



**కాళేశ్వరం:** గుర్తు తెలియని వ్యక్తులు వందేళ్ల వృక్షానికి నిప్పు పెట్టడంతో పోలింగ్ కేంద్రం ఎదుట మంటలు చెలరేగాయి. దీంతో పోలింగ్ అధికారులు, ఓటర్లు ఆందోళనకు గురయ్యారు. మోటార్‌తో నీళ్లు పట్టినా మంటలు తగ్గలేదు. స్పందించిన ఎస్సై లక్ష్మణ్‌రావు సిరొంచలోని ఫైర్ స్టేషన్‌కు వెళ్లి అక్కడి అధికారులతో మాట్లాడి ఫైరింజన్ తీసుకువచ్చి మంటలార్పారు. అనంతరం చెట్టు మండలను కొట్టేశారు. చెట్ల కొమ్మలు ప్రధాన రహదారికి అడ్డుగా పడి ఉండడంతో ఓటర్లు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

### గణపురంలో స్వల్ప ఉద్రిక్తత

**గణపురం:** గణపురంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కార్యకర్తలు పెద్దఎత్తున రావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం ఆందోళనకు దిగారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. మండల వ్యాప్తంగా పలు బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. మైలారం గ్రామంలో ఈవీఎం మొరాయించడంతో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఎస్‌ఐ మచ్చ సాంబమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట భద్రత చేపట్టారు.

### డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల



**కేయూ క్యాంపస్:** కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈఏడాది అక్టోబర్–నవంబర్‌లో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఎం, బీఎస్సీ కోర్సుల (బ్యాక్‌లాగ్ ఇయర్‌వైజ్) పరీక్షల ఫలితాల్ని గురువారం కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు, పరీక్షల నియంత్రణాధికారితో కలిసి విడుదల చేశారు. ఆర్ట్స్ విభాగంలో 81 శాతం, బీబీఎంలో 89 శాతం, బీకాంలో 64 శాతం, బీఎస్సీ బీజెడ్సీలో 64 శాతం, బీఎస్సీ ఎంపీసీలో 72 శాతం ఉత్తీర్ణత విద్యార్థులు సాధించారని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలదేవి తెలిపారు. ఈఫలితాల వివరాల్ని డబ్లూడబ్లూడబ్లూ.కాకతీయ.ఏసి.ఇన్‌లో చూడవచ్చని సూచించారు. ఈపరీక్షల ఫలితాల్లో రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### 11నుంచి బీటెక్ పరీక్షలు

**కేయూ క్యాంపస్:** కేయూ పరిధి బీటెక్ నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు సీబీసీఎస్ రెగ్యులర్, ఎక్స్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ విద్యార్థులకు డిసెంబర్ 11 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11, 13, 15, 18, 20, 22వ తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని వారు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

### నేటి నుంచి కొత్త వైన్స్

**కాజీపేట అర్బన్:** టెండర్‌లో దక్కించుకున్న 65 వైన్స్‌ను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. రూ.2 లక్షల దరఖాస్తు ఫీజుతో 2023–25 ఏడాదికిగాను రెండేళ్ల కాల పరిమితితో వైన్స్‌లు దక్కించుకున్న వారికి మద్యం విక్రయాలతో లక్కు కిక్కు దక్కనుంది. కాగా.. సేల్స్ బాగుండంటూ ఇప్పటికే కొనసాగుతున్న వైన్స్‌ల్లోనే.. కొత్తవి ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

# పోలింగ్ ప్రశాంతం



గొర్లవీడులో ఓటు వేసేందుకు బారులు దీరిన ఓటర్లు



టేకుమట్ల రెండో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళలు



**భూపాలపల్లి నియోజకవర్గంలో 81.02శాతం నమోదు**
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- రాత్రి 8.40 వరకు పోలింగ్..
- అక్కడక్కడా చిన్న చిన్న ఘర్షణలు
- స్ట్రాంగ్ రూంకు చేరుకున్న ఈవీఎంలు, పటిష్ట బందోబస్తు
- ఓటు హక్కు వినియోగించుకున్న నాయకులు, అధికారులు





ఓటు హక్కు వినియోగించుకున్న గండ్ర వెంకటరమణారెడ్డి, సత్యనారాయణరావు, కీర్తిరెడ్డి

**భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్:** చెదురుముదురు ఘటనలు మినహా గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. మూడు, నాలుగు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ రాత్రి వరకు సాగింది. దీంతో ఓటర్లు కొద్దిపాటి అసహనానికి లోనయ్యారు. జిల్లా అధికారులు, పలు పార్టీల నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులు స్థానికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**పోలింగ్ శాతం సేమ్..**

గత ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 82.13 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి ఎన్నికల్లో 81.02 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల అధికారుల నుంచి సేకరించిన ప్రాథమిక సమాచారం మేరకు అధికారులు పోలింగ్ శాతం ప్రకటన విడుదల చేశారు. అర్ధరాత్రి వరకు ఎన్నికల అధికారులు స్ట్రాంగ్ రూంకు చేరుకొని పోలింగ్ ప్రక్రియ పూర్తి సమాచారం అందించాక ఓటింగ్ శాతం మరింత పెరిగి గతేడాది మాదిరిగానే నమోదయ్యే అవకాశం ఉంది.

**మొరాయించిన ఈవీఎంలు..**

మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలోని 185వ పోలింగ్ బూత్‌లో మధ్యాహ్నం రెండు గంటల పాటు ఈవీఎం మొరాయించింది. దీంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయం 4గంటల వరకు సుమారు 200మంది క్యూలైన్‌లో ఉండటంతో రాత్రి 8.10 గంటల వరకు పోలింగ్ జరిగింది. రేగొండ మండలం రంగయ్యపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన రెండు పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు నెమ్మదిగా పనిచేశాయి. దీంతో పోలింగ్ ముగిసే సమయం వరకు కూడా సుమారు 300 మంది క్యూలైన్‌లో ఉన్నారు. పోలింగ్ ప్రక్రియ రాత్రి 8.40 గంటల వరకు జరిగింది. చిట్యాల మండలం రామచంద్రాపూర్ గ్రామంలోని 108వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం గంటపాటు మొరాయించింది. భూపాలపల్లి మండలం నాగారంలో సాయంత్రం ఓటర్లు ఒక్కసారిగా భారీగా రావడంతో రాత్రి 7గంటల వరకు పోలింగ్ జరిగింది.

**ఓటు వేస్తూ ఫొటో తీసుకున్నందుకు...**

చిట్యాల మండలం దూత్‌పల్లి గ్రామానికి చెందిన ఎండీ జావీద్ ఓటు వేస్తున్న ఫొటోను తీసి వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. దీంతో అతడిపై ఎస్సై రమేష్ కేసు నమోదు చేశాడు.

**ఓటు వేసిన ముఖ్యులు..**

భూపాలపల్లి నియోజకవర్గంలో పలువురు నాయకులు, అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ శాసన సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పట్టణంలోని గాంధీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్, బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు తన స్వగ్రామమైన గణపురం మండలం బుద్దారం గ్రామంలో, కలెక్టర్ భవేష్ మిశ్రా పట్టణంలోని మంజూర్‌నగర్ పాఠశాలలో, అదనపు కలెక్టర్ ఆర్ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత కుందూరుపల్లిలోని పోలింగ్ స్టేషన్‌లో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రమాదేవి పట్టణంలోని 33వ పోలింగ్ స్టేషన్‌లో, రాష్ట్ర దివ్యాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి భూపాలపల్లి మండలంలోని గొర్లవీడులో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**స్వల్ప ఘర్షణలు..**

టేకుమట్ల మండలం అంకుశాపూర్ గ్రామ పోలింగ్ కేంద్రం సమీపంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కొద్దిపాటి ఘర్షణ నెలకొంది. కారు గుర్తుకు ఓటు వేయాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఓటర్లను కోరుతుండగా కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు వచ్చి ఇరు వర్గాలను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. చిట్యాల మండలంలోని చింతకుంటరామయ్యపల్లి, వెంచరామి గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది.

**స్ట్రాంగ్ రూంకు చేరుకున్న ఈవీఎంలు..**

నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు ఉపయోగించిన ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంకు తరలించారు. స్ట్రాంగ్ రూం వద్ద పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. ఎస్పీ కిరణ్ ఖరే స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ ముగిసే వరకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సమర్థవంతంగా పనిచేసిన సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసు సిబ్బంది, జిల్లాలోని పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

**నియోజకవర్గంలో పోలింగ్ శాతం..**

| సంవత్సరం | శాతం |
|---|---|
| 2014 | 79.73 |
| 2018 | 82.13 |
| 2023 | 81.02 |

**పోలింగ్ సరళి...**

| సమయం | శాతం |
|---|---|
| ఉదయం 7 -9 | 10.50 |
| ఉదయం 9-11 | 27.80 |
| ఉదయం 11- మధ్యాహ్నం 1 | 49.12 |
| మధ్యాహ్నం 1-3 | 64.03 |
| 3 నుంచి పోలింగ్ ముగిసే వరకు | 81.02 |

### చేయి కోసుకున్న ఓటరు..



గణపురం మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన సంపత్ సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కేంద్రానికి చేరుకున్నాడు. ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా అధికారులు నిరాకరించారు. దీంతో సంపత్ మనస్థాపానికి గురై కత్తితో చేయి కోసుకున్నాడు.



ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు



చిట్యాల: జడలపేటలో ఓటు వేసేందుకు..



క్యూ లైన్‌లో నిల్చున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా




ఓటరు సెల్ఫీ పాయింట్ వద్ద ఆర్డీఓ రమాదేవి



ఓటు వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీధర్‌బాబు



పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే



ఓటింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తీసుకెళ్తున్న సిబ్బంది

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

**కాటారం:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పెద్దపల్లి జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు శ్రీధర్, ఎస్పీ కిరణ్‌ఖరే గురువారం పరిశీలించారు. కాటారం, గారెపల్లి, రేగులగూడెం, ధన్వాడ, శంకరాంపల్లి పోలింగ్ కేంద్రాలను పరిశీలకులు శ్రీధర్, దేవరాంపల్లి, దామెరకుంట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించి పోలింగ్ సరళిపై ఆరా తీశారు. పోలింగ్ సజావుగా, వేగంగా కొనసాగించాలని సూచించారు. వారివెంట డీఎస్పీ రాంమ్మోహన్‌రెడ్డి, సీఐ రంజిత్‌రావు, ఎస్సై అభినవ్, తహశీల్దార్ నాగరాజు, ఆర్‌ఐ వెంకన్న ఉన్నారు.

## సజావుగా సాధారణ పోరు



కాటారం పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి బారులుదీరిన ఓటర్లు

**మంథని:** మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో ఎన్నికల పోరు చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. అక్కడక్కడా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు మొరాయించడంతో చాలాచోట్ల పోలింగ్ ఆలస్యమైంది. కొన్ని కేంద్రాల్లో మొదట్లోనే మొరాయించగా, మరికొన్ని కేంద్రాల్లో చివరి సమయంలో సతాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ సమయం కాగా ఏడు దాటినా కొన్ని కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. దీంతో ఓటర్లు గంటల తరబడి నిరీక్షించారు. చాలా కేంద్రాల్లో ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోవడం, అధికారులు సైతం అలసత్వంగా పనిచేయడంతో ఓటు వేయడానికి ఓటర్లు గంటల తరబడి నిలబడ్డారు. ఉదయం పూట బారులుదీరిన ఓటర్లు మధ్యాహ్నం వరకు తగ్గడంతో కొన్ని కేంద్రాలు వెలవెలబోయాయి. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పహారా కాశారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని నమోదు చేశారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్, రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

## వెల్లివిరిసిన యువ చైతన్యం

- ఓటు హక్కు వినియోగించుకున్న యువ ఓటర్లు

### హైదరాబాద్ నుంచి వచ్చాను..



నాకు ఈ సంవత్సరమే ఓటు హక్కు వచ్చింది. ఓటరు స్లిప్పు ఇంట్లో ఇచ్చారని మా కుటుంబసభ్యులు చెప్పగానే చాలా సంతోషం అనిపించింది. హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ ఓటు వేయాలనే తపనతో ఉదయమే కాటారం చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నాను.

**- గాదె హిమబిందు, కాటారం**



ఓటేసిన యువ ఓటర్లు

**కాటారం:** ప్రజాస్వామ్యంలో ఓటు ఓ వజ్రాయుధం. ఒక్క ఓటుకు సమాజాన్నే మార్చగలిగిన శక్తి ఉంది. అలాంటి ఓటును వినియోగించుకోవడంలో గతంలో యువత వెనుకంజలో ఉండేది. 18ఏళ్లు నిండిన ఓటు నమోదు చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు. కానీ ప్రస్తుతం యువత మారుతున్న సమాజానికి అనుగుణంగా ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందు వరుసలో ఉంటుంది. 18ఏళ్లు నిండగానే ఓటరుగా నమోదు చేసుకుంటున్నారు. గురువారం పోలింగ్‌లో యువ చైతన్యం వెల్లివిరిసింది. గతంతో పోల్చుకుంటే ఈ ఎన్నికల్లో యువత అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకుంది. పలువురు యువ ఓటర్లు పట్టణాలు, దూర ప్రాంతాల్లో చదువుకుంటూ, ఉద్యోగం, ఇతరత్రా పనులు చేసుకుంటున్న వారు గురువారం స్వగ్రామాలకు చేరుకొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటి సారి ఓటు వేయడం ఎంతో అనుభూతిని ఇచ్చిందని పలువురు యువ ఓటర్లు సాక్షికి వెల్లడించారు.

### సంతోషంగా ఉంది



నాకు 18 సంవత్సరాలు నిండటంతో నేను ఈ ఏడాది ఓటు నమోదు చేసుకున్నాను. మొదటిసారి ఓటు వేయడం సంతోషంగా ఉంది. ఫస్ట్‌టైం ఓటు వేయబోతున్నాననే అనుభూతి నా జీవితంలో మర్చిపోలేను.

**- పులి సాయితేజశ్విని, కాటారం**

### ఓటు నా బాధ్యత..



ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం నా బాధ్యత అని భావించాను. అందుకోసమే ఎంత కష్టమైనా మా గ్రామం చేరుకొని ఓటు హక్కు వినియోగించుకున్నాను. మొదటి సారి ఓటు వేయడం గర్వంగా ఫీల్ అవుతున్నా. ప్రజాస్వామ్య పరిరక్షణలో నేను భాగస్వామ్యం అవడం సంతోషంగా ఉంది.

**- అభిలాష్, గారెపల్లి**

### ప్రతిసారి ఓటు వినియోగించుకుంటా..



నేను ఈ ఎన్నికల్లో మొదటిసారి ఓటువేశాను. ఇక నుంచి ప్రజాస్వామ్యంలో జరిగే ప్రతి ఎన్నికల్లో నా ఓటు హక్కు వినియోగించుకుంటాను. మెరుగైన సమాజం కోసం నా వంతు కృషి చేస్తా. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూస్తాను.

**- కోరబోయిన మారుతి, గంగారం ఎక్స్‌రోడ్డు**

## ఓటేసిన ట్రాన్స్‌జెండర్లు



**కాటారం:** ప్రజాస్వామ్యంలో ఓటు ఎంత ప్రాముఖ్యమైందో ప్రతి ఒక్కరిలో అవగాహన పెరిగిపోతుంది. కాటారం మండలంలో ట్రాన్స్‌జెండర్స్ గురువారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. మద్దులపల్లిలో నివాసం ఉంటున్న ఏడుగురు ట్రాన్స్‌జెండర్స్ కాటారం హై స్కూల్ పోలింగ్ కేంద్రంలో తమ ఓటు వేశారు.

## క్లుప్తంగా

### ఓటువేసేందుకు వెళ్తూ.. అనంతలోకాలకు..

- గోవిందాపూర్‌లో రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే చిన్నారి మృతి, తండ్రికి తీవ్ర గాయాలు..

**శాయంపేట/ భూపాలపల్లి రూరల్ :** శాయంపేట మండలంలోని గోవిందాపూర్ దర్గా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామానికి చెందిన బోడకుంట్ల రాంబాబు హనుమకొండలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఎన్నికలలో తన ఓటు వినియోగించుకోవడానికి కూతురు సింధు వైష్ణవి(8)ని తీసుకుని ద్విచక్ర వాహనంపై నేరేడుపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో గోవిందాపూర్ దర్గా సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొనడంతో సింధువైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది. రాంబాబుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### గుండెపోటుతో వృద్ధురాలు..

**కేసముద్రం:** ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి సిద్ధమైన ఓ వృద్ధురాలు గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన గురువారం మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొలిపాక వెంకటమ్మ(80) ఓటు వేయడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లే క్రమంలో గుండెపోటుకు గురై మృతి చెందింది.

### ఓటు వేసిన గంటకు అనారోగ్యంతో వృద్ధుడు..


ఎల్లయ్య(ఫైల్)

**సంగెం:** ఓటు హక్కు వినియోగించుకుని ఇంటికి వచ్చిన గంటకు అనారోగ్యంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగెంలో జరిగింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సింగారపు ఎల్లయ్య(65) గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నాడు. ఇంటికి వెళ్లిన గంట తర్వాత తుది శ్వాస విడిచాడు. మృతుడికి భార్య సూరమ్మ, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

# పల్లా వర్సెస్ కొమ్మూరి..

- పరుష పదజాలంతో దూషణల పర్వం
- అడుగడుగునా టెన్షన్.. టెన్షన్
- పలుచోట్ల లాఠీచార్జ్
- రంగంలోకి డీసీపీ, ఏసీపీ, పోలీసు బలగాలు
- పసరమడ్లలో కాంగ్రెస్‌కు ఓట్లు వేయిస్తున్నారని అభ్యంతరం



జనగామ ప్రభుత్వ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఆయా పార్టీల శ్రేణుల మధ్య వాగ్వాదం


ఘర్షణ పడుతున్న కార్యకర్తలను ఆపుతున్న పోలీసులు


లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

**జనగామ:** తెలంగాణ అసెంబ్లీ పోలింగ్ సందర్భంగా గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య జరిగిన ఉద్రిక్త పరిస్థితులు పోలీసులకు ముచ్చెమటలు పట్టించాయి. బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయన సతీమణి నీలిమ, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆయన తనయుడు ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి, ఆయా పార్టీల కేడర్ ఎదురు పడితేచాలు.. మాటల తూటాలు అగ్గిరాజేశాయి. దీంతో పోలీసు శాఖ అలర్ట్ అయింది. డీసీపీ సీతారాం నేతృత్వంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, స్థానిక పోలీసులతో పాటు బీఎస్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారనున్న నేపథ్యంలో అదనపు బలగాలు రప్పించారు.జనగామ పట్టణం, మండల పరిధిలో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలోని 8 మండలాలను అలర్ట్ చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఇరు కుటుంబాల సభ్యులు, ఆరుట్ల దశమంతరెడ్డి ఆయా మండలాల పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించే క్రమంలో పోలీసులు రెగ్యులర్ కంటే అదనంగా బందోబస్తు చేపట్టారు.

**అడుగడుగునా టెన్షన్ టెన్షన్..**

జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ పోలింగ్ కేంద్రానికి పల్లా సతీమణి నీలిమ వెళ్లగా, అదే సమయంలో కొమ్మూరి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి, కోడలు దివ్య కూడా వెళ్లారు. ప్రతి చోటకు తమ వెనకనే రావడం ఏంటని నీలిమ వారిని నిలదీశారు. బయట నుంచి ప్రైవేట్ వ్యక్తులను తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయిస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి నిలదీయడంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం జరిగింది. విషయం తెలుసుకున్న ఇరుపార్టీల శ్రేణులు ఘటనాస్థలికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. డీసీపీ వచ్చి నీలిమ, ప్రశాంత్‌రెడ్డికి నచ్చ చెప్పి పంపించారు. అయితే ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎంతకూ వినకపోవడంతో చెదరగొట్టారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ స్కూల్ పోలింగ్ కేంద్రానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాగా, ఆయన వెంట ఉన్న ఓ వ్యక్తిని ఆయా పార్టీల నాయకులు అనుమానించడంతో.. అక్కడే ఉన్న బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులు జత కలవడంతో ఆ వ్యక్తిని చితక బాదారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు సైతం రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు మరోసారి చెదరగొట్టారు.

**అభ్యర్థుల పరుష పదజాలం..**

గొడవ సద్దుమణిగిందనుకుంటున్న తరుణంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టణంలోని గ్రెయిన్ మార్కెట్ పోలింగ్ కేంద్రానికి రాగా అనుచరవర్గంతో ఎలా వస్తారని కాంగ్రెస్ శ్రేణులు నిలదీశాయి. కొమ్మూరి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి కూడా ఆగ్రహం వ్యక్తం చేయడం, ఇరువురి వాహనాలకు కేడర్ అడ్డుతగలడంతో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. లాఠీ చార్జ్ చేసే వరకూ కార్యకర్తలు అక్కడ నుంచి కదల లేదు. గ్రెయిన్ మార్కెట్ నుంచి పల్లా నేరుగా జనగామ మండలం శామీర్‌పేట పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ సైతం గులాబీ కండువా వివాదం తలెత్తడం, అదే సమయంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రావడంతో ఇరువురు పరుష పదజాలంతో దూషించుకున్నారు. చూసుకుందాం అంటే.. చూసుకుందాం అంటూ సవాల్ విసురుకున్నారు. దీంతో రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు నినాదాలతో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలను పోలీసులు బలవంతంగా బయటకు తీసుకురాగా, అక్కడ కేడర్ అడ్డుపడ్డారు. ఇరువురు ఘర్షణపడే సమయంలో పోలీసులు ఎక్కడికక్కడ లాఠీలతో చెదరగొట్టారు. అలాగే, కొమ్మూరి వెళ్లే క్రమంలో పోలింగ్ కేంద్రానికి కొద్ది దూరంలో పార్టీ శ్రేణులతో మాట్లాడేందుకు ఆగగా, అటువైపు బీఆర్ఎస్ శ్రేణులు కదలడంతో గ్రహించిన పోలీసులు, వారిని అక్కడే నిలిపివేశారు.

**పసరమడ్లలో ఉద్రిక్తత**

జనగామ మండలం పసరమడ్లలోని ఓ పోలింగ్ బూత్‌లో ఓ బీఎల్‌ఓ వృద్ధురాలిని తీసుకెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయిస్తున్నారని బీఆర్ఎస్ ఏజెంట్ ఆరోపించారు. వెంటనే పల్లా సతీమణి నీలిమకు సమాచారం అందించగా ఆమె తమ అనుచరులతో కలిసి అక్కడకు వెళ్లారు. ఈ విషయమై నీలిమ నిలదీయంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. అంతకు ముందుగానే పోలీసులకు సమాచారం రావడంతో అక్కడ ఎలాంటి దాడులు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జనగామ మండలం గోపిరాజుపల్లిలో ఆయా పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాగే ఓబుల్‌కేశ్వాపూర్, వడ్లకొండ గ్రామాల్లో సైతం స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

# ఉద్రిక్తతలు.. ఘర్షణలు


ఏటూరునాగారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల తోపులాట


ఖానాపురం: బుధరావుపేటలో ఘర్షణ పడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

- పోలింగ్ కేంద్రాల వద్ద పలు పార్టీల శ్రేణుల బాహాబాహీ
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు

**ఏటూరునాగారం:** మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం బయట పోలింగ్ సమయం 4 గంటలు దాటగానే చివరి నిమిషాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు ఒకరినొకరు దూషించుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క పోలింగ్ కేంద్రంలోకి వస్తుండగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ఓడిపోతుందని నినాదాలు చేయడంతో ఘర్షణ నెలకొంది. అలాగే, బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఓడిపోతుందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొనడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో సీఐ మండల రాజు, సిబ్బంది వారిని చెదరగొట్టారు.

**ఖానాపురంలో..**

**ఖానాపురం:** మండల వ్యాప్తంగా పలు పోలింగ్ బూత్‌ల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పోలింగ్ బూత్‌ల్లోకి వచ్చి ప్రచారం చేపట్టారు. దీంతో ఇరువర్గాలు పరస్పర దూషణలకు దిగడంతో ఘర్షణలు జరిగాయి. అశోక్‌నగర్, బుధరావుపేట, ఖానాపురం, కొడ్తిమాటుతండాతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణలు చోటు చేసుకొని ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఖానాపురం, బుధరావుపేట, అశోక్‌నగర్ పోలింగ్ బూత్‌లలో ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. దీంతో ఘర్షణల నడుమ పోలింగ్ కొనసాగింది. ఘర్షణల సందర్భంగా ఇరు వర్గాలను సీఐ పుల్యాల కిషన్, ఎస్సై మాధవ్ చెదరగొట్టారు. పలు పోలింగ్ బూత్‌లను ఏసీపీ తిరుమల్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

**పర్వతగిరిలో..**

**పర్వతగిరి:** మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ బయట బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ జరిగింది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఒకే సారి గుంపుగా పోలింగ్ బూత్ వద్దకు రావడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొనగా ఇరుపార్టీల శ్రేణులు మధ్య గొడవ జరిగింది.

## ఓటర్లపై పోలీసుల దురుసు ప్రవర్తన


క్షతగాత్రులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ

**ఖిలా వరంగల్:** వరంగల్ 33వ డివిజన్ పెరకవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. సాయంత్రం 4.45 నిమిషాలకు పోలింగ్ బూత్‌కు ఒక్కసారిగా ఓటర్లు భారీగా చేరుకోవడంతో క్యూలైన్‌లో తోపులాట జరిగింది. దీంతో బీఎస్ఎఫ్ బలగాలు ఒక్కసారిగా లాఠీ ఝులిపించారు. దీంతో అవినాష్, జడల సతీష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొండా సురేఖ క్షతగాత్రులను పరామర్శించారు. సెంట్రల్ డీసీపీ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

**కన్నాయిగూడెంలో..**


కన్నాయిగూడెం : చేతిపై కనిపిస్తున్న లాఠీ దెబ్బలు

**కన్నాయిగూడెం:** మండలంలో జరిగిన పోలింగ్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముప్పనపల్లిలో ఓటు వేయడానికి క్యూలైన్‌లో ఓటర్లపై సీఆర్పీఎఫ్ సిబ్బంది లాఠీ ఝులిపించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓటర్లు సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై మూకుమ్మడిగా వెళ్లడంతో వెనుదిరిగారు. కొంత మందికి లాఠీ దెబ్బలతో వాతలు వచ్చాయి.


న్యూశాయంపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న బండా ప్రకాశ్ కుటుంబీకులు


కురవి పెద్ద తండాలో మంత్రి సత్యవతి ..


మానుకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ కవిత కుటుంబ సభ్యులు


భూపాలపల్లిలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి..


జులైవాడలో టీఎస్‌పీఎస్సీ సభ్యుడి కారం రవీందర్‌రెడ్డి దంపతులు


న్యూశాయంపేటలో రావుపద్మ..


హనుమకొండలో సీపీఐ నేత తక్కళ్లపల్లి..


బచ్చన్నపేటలో మాజీ చీఫ్ విప్ బోడకుంటి..


మానుకోటలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ ..


శాయంపేట: గోవిందాపూర్‌లో ఓటు వినియోగించుకున్న వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి


నడికూడ: వరికోల్ గ్రామంలో ఓటు వేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి


నక్కలగుట్టలో టీఎన్జీవో మాజీ చైర్మన్ సుబ్బారావు..


న్యూశాయంపేటలో మంద కృష్ణ మాదిగ..


హనుమకొండ టీచర్స్‌కాలనీలో ఓటు హక్కు వినియోగించుకున్న కడియం శ్రీహరి కుటుంబీకులు


వరంగల్ ఆంధ్రబాలిక కాలేజీలో ఓటు హక్కు వినియోగించుకున్న మేయర్ గుండు సుధారాణి..


ఏనుగల్లులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన వృద్ధురాలు


జనగామ జిల్లా కేంద్రంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

# పోల్.. కూల్..

- ప్రశాంతంగా ముగిసిన తెలంగాణ శాసనసభ ఎన్నికలు
- ఉదయం 7 గంటలకే బారులుదీరిన ఓటర్లు
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

తెలంగాణ శాసనసభ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చెదురుమదురు ఘటనలు మినహా సాఫీగా సాగింది. పోలింగ్ గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఓటువేయడానికి ఓటర్లు క్యూలైన్లలో బారులు దీరారు. కొన్ని చోట్లు ఈవీఎంలు మొరాయించగా కొంత సేపు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు


ఏటూరునాగారంలో చిన్నారిని తీసుకుని ఓటు వేసేందుకు వచ్చిన మహిళ





భూపాలపల్లిలో ఓటు వేసేందుకు వృద్ధులు, దివ్యాంగులను తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు, సహాయకులు


కేసముద్రం మండలం అమీనాపురంలో..


హనుమకొండ న్యూశాయంపేటలో..


మహబూబాబాద్: వేమునూరులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన మహిళలు


నర్సంపేటలో ఓటు వేసిన 105 ఏళ్ల వృద్ధురాలు సత్తమ్మ


కరీమాబాద్‌లో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు